# నా జీవితంలో అవినీతికి పాల్పడలేదు

- పెబ్బేరు సంత స్థలం వివాదంలో నాపాత్ర లేదు
- రాజకీయంగా దెబ్బ కొట్టేందుకే ఆరోపణలు
- మళ్లీ గెలిపిస్తే పెబ్బేరును రెవెన్యూ డివిజన్ చేస్తా.. పోలీస్ సర్కిల్ తీసుకొస్తా..
- పెబ్బేరు రోడ్డు షోలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- హాజరైన ఎమ్మెల్సీ చల్లా, కార్పొరేషన్ చైర్మన్ రజిని


రంగాపురంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు, నవంబరు 21: ' న్యాయవాద వృత్తిలో తాను కొనసాగి ఉంటే ఇప్పటి వరకు హైకోర్టు జడ్జి స్థానంలో ఉండే వాడిని. ప్రజల కోసం తెలంగాణ జెండా పట్టుకొని జీవితాన్ని త్యాగం చేశాను. రాజకీయాల్లో ఎవరి దగ్గరైనా చేయి చాపినట్లు రుజువు చేస్తే దేనికైనా సిద్ధం. అవినీతి అనే పదం నా జీవితంలో లేదు' అంటూ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మంగళవారం రాత్రి పెబ్బేరు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరిగిన రోడ్డుషోలో ఆయన మాట్లాడారు. పెబ్బేరు సంత స్థలం విషయంలో తన జోక్యం ఉన్నట్లు విపక్షాలు ఆరో పిస్తున్నాయని, అదే నిజమైతే ఏ చిన్న రుజువుకైనా తాను విచారణకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. ప్రభు త్వ నిబంధనలు, చట్టప్రకారమే వే ణుగోపాలస్వామి ఆలయ పూజారికి సంత స్థలంపై ఓఆర్‌సీ వచ్చిందని, ఒక వేళ ఇదే తప్పనిపిస్తే ఎవరైనా ఉన్నత కోర్టులకు వెళ్లవచ్చని ఆయన సూచించారు. అట్లగాకుండా తన రాజకీయ ఎదు గుదలను ఓర్వలేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ నిందలు వేయడం సమంజ సం కాదని ఆయన చెప్పారు. పెబ్బేరు మండలం నుంచే తాను తెలంగాణ ఉద్య మానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తనపై పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పార్టీ టికెట్‌ను కొన్నట్లు ప్రజలను కొనలేడని, తాను నియోజక వర్గానికి చేసిన అభివృద్ధి పనులే తను అండదండ అని అన్నారు. తాను మరోసారి గెలిస్తే పెబ్బేరును రెవెన్యూ డివిజన్‌గా మారుస్తానని, పోలీస్ సర్కిల్‌ను ఏర్పాటు చేయిస్తానని మంత్రి నిరంజన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పరు గులు పెడుతున్నాయని చెప్పారు. నిరంజన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ రజనీ మాట్లాడుతూ రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, పట్టణ పార్టీ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

### రేషన్ బియ్యం తిన్న నేల మీద సన్నబియ్యం

'ఒకప్పుడు రేషన్ బియ్యమే ప్రజలకు పరమాన్నం. ఇప్పుడు ప్రతి రైతు సన్న బియ్యం పండించే దశకు చేరుకోవడమే కాదు.. దేశానికి అన్నం పెట్టే రైతన్నగా ఎదిగాడు. తెలంగాణ రాష్ట్రం అవిర్భావ ఫలితం ఇంతకన్నా ఏం కావాలి' అంటూ వ్యాఖ్యానించారు వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. మంగళవారం పెబ్బేరు మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రంగాపురం, రాంపురం, రామమ్మపేట, శాఖాపురం, తోమాలపల్లె గ్రామా ల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఫలితాలు అనుభవిస్తున్న ప్రజలను నాశనం చేసేందుకే కల్లిబొల్లి మాటలతో కాంగ్రెస్ పార్టీ మీ ముందుకు వస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బియ్యాన్ని మనకు చౌకధరల దుకాణాల్లో పంపిణీ చేసేవారు, కానీ ఇప్పుడు దేశానికే తెలంగాణ బియ్యం అవసరం అవుతున్నదని అన్నారు. దేశంలో పంజాబ్‌లోనే వరి ధాన్యం కోటి టన్నుల వరకు పండిస్తుండగా, ఇప్పుడు దాన్ని తెలంగాణ అధిగమించి కోటి 10లక్షల టన్నుల ధాన్యాన్ని పండించి దేశంలో నే నెంబర్ వన్‌గా నిలిచిందని చెప్పా రు. రైతాంగానికి అన్ని రకాలుగా బాసటగా నిలిచిన ప్రభుత్వం కూడా ఇదేనని అన్నారు. ఎంతో కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసే కుట్ర సాగుతున్నదని, దీనిని ప్రజలు సహించరని చెప్పారు. 90శాతం రైతులకు రుణ మాఫీ జరిగిందని, ఇంకా కొంత మందికి మాత్రమే మాఫీ కావాల్సి ఉందని తెలిపారు. తిరిగి ప్రభుత్వం వచ్చిన వెంటనే రుణ మాఫీని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలు నమ్మబోరని తెలిపారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చూడబోతున్నారని, తనకు రెండోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చేందుకు కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని నిరంజన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ పెద్దింటి పద్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, సింగిల్ విండో అధ్యక్షుడు కోదండరాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాలచంద్రారెడ్డి, నాయకులు గౌని బుచ్చారెడ్డి, ఆంజనేయులు సాగర్, శ్యామల, శంకర్‌నాయుడు, రాజశేఖర్, సత్యారెడ్డి, మజీద్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


పెబ్బేరు రోడ్డుషోకు హాజరైన జనం సందోహం

## హత్యచేసిన వ్యక్తికి 11 ఏండ్లు కారాగార శిక్ష

మహబూబ్‌నగర్‌మెట్టుగడ్డ, నవంబర్ 21 : పెద్దమ్మను హత్యచేసిన వ్యక్తికి 11 ఏండ్లు కఠిన కారాగార శిక్షతోపాటు జరిమానా విధిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా సెక్షన్ ప్రధాన న్యాయమూర్తి పాపిరెడ్డి మంగళవారం తీర్పు వెల్లడించారు. జిల్లా సెక్షన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ కథనం మేరకు కోయిలకొండ పోలీసు స్టేషన్ పరిధిలో కొత్లాబాద్ గ్రామంలో 2020 అక్టోబర్ 4న సాయంత్రం 5:30గంటలకు వడ్డె బాలకిష్టప్ప తాగిన మైకంలో భార్య లక్ష్మిని, బాలకిష్టప్ప తల్లి బాలమ్మ కొట్టడంతో బాలమ్మ సొంత అక్క హన్మమ్మ అడ్డురాగా ఆమెను బలంగా నెట్టివేయడంతో పక్కనే ఉన్న రాళ్ల కుప్పపై పడి హన్మమ్మ మృతిచెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి బాలకిష్టప్పను అదుపులోకి తీసుకోని విచారణ జరిపి చార్జిషిట్ దాఖలు చేశారు. జిల్లా ప్రధాన కోర్టులో కేసు విచారణ ప్రారంభించి పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెక్కెం జనార్దన్ పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ హత్యకు బాలకిష్టప్ప మాత్రమేనని బలంగా సాక్షాలు చెపడంతో నిందితుడికి పది ఏండ్లు కఠిన కారాగార శిక్ష, తల్లి బలమ్మను కొట్టినందుకు మరో ఏడాది శిక్ష, వెయ్యి రూపాయాల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు నిచ్చారు.

## పరీక్షా కేంద్రం పరిశీలన

మహబూబ్‌నగర్‌టౌన్, నవంబర్ 21 : జిల్లాలో నిరుద్యోగ, యువతీ, యువకులు ఉపాధి కోర్సుల్లో వృతిశిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు. బ్యూటీయేషన్, ప్యాషన్‌డిజైనింగ్, జర్దోసి, కంప్యూటర్, ఏసీ మెకానిక్, మొబైల్ రిపేర్, సీసీ కెమెరా, హౌజ్ వైరింగ్ కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ పొందిన 11వ బ్యాచ్‌కు మంగళవారం పరీక్ష నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సెట్విన్ వారిచే ధ్రువపత్రాలను అందజేస్తారని, ప్రైవేటు ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 196మంది శిక్షణ తీసుకున్న అభ్యర్థులు పరీక్ష రాశారు. కార్యక్రమంలో సెట్విన్ కోఆర్డినేటర్ సత్యనారాయణరెడ్డి, పరీక్ష నిర్వాహకులు సుజన, మాధవి ఉన్నారు.

## ప్రశాంతంగా కెమిస్ట్రీ పరీక్షలు

పాలమూరు, నవంబర్ 21 : పాలమూరు విశ్వవిద్యాలయంలోని పీజీ కళాశాలలో మంగళవారం ఐదు సంవత్సరాల ఇంటిగ్రేడ్ కెమిస్ట్రీ 9వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. ఈ పరీక్షలను పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు తనిఖీ చేసి అన్సర్ బుక్‌లెట్‌పై సబ్జెక్టు, హల్ టికెట్, కోడ్ మొదలగు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శాంతిప్రియ, పీజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, పరీక్షల పర్యవేక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందనలు

పాలమూరు, నవంబర్ 21 : మహబూబ్‌నగర్ అందుల, అనాథల, అభాగ్యుల పునరావాస శిక్షణ సేవా సంస్థ ఇట్రాడ్ అనే సంస్థ లుంబిని హైస్కూల్లో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమంలో విద్యార్థులు పై సంస్థ సహయార్థం సేకరించిన రూ.29,442 డబ్బులను అందజేశారు. విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ లక్ష్మణ్‌గౌడ్, కరస్పాండెంట్ , ప్రిన్సిపాల్ అభినందించారు.

# భవిష్యత్‌కు బాటలు వేసే చర్చలు ఆదర్శనీయం

- ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి నిరంజన్‌రెడ్డి
- వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి
- మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి

వనపర్తి టౌన్, నవంబర్ 21 : భవిష్యత్ కోసం బాటలు వేసే స్ఫూర్తిదాయకమైన చర్చలు చేయడం ఆదర్శనీయం, అభినందనీయమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో 1969–70 బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమ్మేళనాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మంత్రి హాజరై మాట్లాడు తూ భవిష్యత్ వనపర్తి కోసం ఒక ప్రణాళిక, ప్రాతిపదిక మీద ఎన్నికల అనంతరం సమ్మేళనం పెడదామని మంత్రి చెప్పారు. సామాన్యుల ఆలోచన నుంచి, విద్యావం తులు, ప్రజల నుంచి విశాల ప్రతిపాదికన అర్థవంతమైన మహోన్నత ఆలోచనలు ఉద్భవిస్తాయని మంత్రి చెప్పారు. ఇటీవల జనంలో నిరంతరం తిరగడంతో అనేక విషయాలను గ్రహించి నేర్చుకున్నానని ఆయన గుర్తుచేశారు. నాడు కడుపులు నిండితే చాలు అనుకునే స్థితి నుంచి పదేండ్లలో సౌకర్యవంతమైన జీవితాన్ని పొందే స్థితికి తెలంగాణలో ప్రజలు వచ్చారని అదే మార్పు అని అన్నారు. వనపర్తిలో ఎన్నో విద్యా సంస్థలు వచ్చాయని, ఇంజినీరింగ్, మెడికల్, అగ్రికల్చర్, మత్స్యకళాశాలలు తీసుకొచ్చామని, మరిన్ని ఉన్నత విద్య సంస్థలు రావాల్సి ఉందని వాటిని తీసుకొస్తే ఉన్నత విద్య పరిపూర్ణంగా ఈ ప్రాంత ప్రజలకు లభిస్తుందన్నారు. ప్రజల కష్టాలను సాహిత్య , పాటల రూపంలో ప్రజల హృదయాలను కదిలించడంతోనే తెలంగాణ సాధనకు ఆయువుపట్లు అయ్యిందన్నారు. తెలంగాణ సిద్ధించాక వ్యవసాయ రంగం , నీటిపారుదలతో సుస్థిర అభివృద్ధి జరిగిందని, తద్వారా మార్పు చోటుచేసు కున్నదని, అభివృద్ధిలో భాగస్వామిని అయ్యాననే తృప్తి తనకు ఉందని మంత్రి వెల్లడించారు. ప్రజలను అభివృద్ధి చేయాలనే తపనతో పరుగులు పెడుతున్న సమయంలో కొందరిని చూడలేకపోవచ్చని అంతే తప్పా వేరే ఉద్దేశం తనకు లేదని తెలిపారు. వనపర్తి నియోజక వర్గంలో తొలి ఎమ్మెల్యే సురవరం ప్రతాపరెడ్డి మొదలుకొని నేటి వరకు పనిచేసిన ఎమ్మెల్యేలు విద్యావంతులు, మేధావులేనని ఆయన గుర్తుచేశారు. మేధావులు, ప్రజలు వారి ఆలోచనలతో భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే చక్కని ప్రణాళికను రూపొందించేందుకు అనేక సమ్మేళనాలను విద్యా వంతులతో నిర్వహించామన్నారు. అనంతరం రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వయసు కంటే ఆలోచనలు, మెదడు పనిచేస్తున్నంత కాలం విరమణ ఉండ దని, వ్యక్తిగత విమర్శలు మానాలని హితవు పలికారు. మేధావులు, విజ్ఞులు విధానపరమైన విమర్శలే చేస్తారని ఆయన గుర్తుచేశారు. విభజన చట్టంలోని ఆంశాలను అమలుపర్చిన పార్టీ బీఆర్ఎస్ అని , ప్రజల అభివృద్ధి లక్ష్యంగా అనుక్షణం బీఆర్ఎస్ పనిచేస్తున్నందుకే పార్టీలో చేరినట్లు తెలిపారు.

### గులాబీ గూటికి నాయకులు..

ఖిల్లాఘణపురం మండలకేంద్రానికి చెందిన 20మంది యువకులు మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఘణపురం యువకులు నవీన్, ఉదయ్, రాఘవేందర్‌తో పాటు మరి కొంత మంది యువకులు ఉన్నారు. సమ్మేళనంలో జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బి.లక్ష్మయ్య, విశ్రాంత ఉద్యోగులు డాక్టర్ వీరయ్య, డాక్టర్ మురళీధర్, రాఘవేందర్‌రెడ్డి, విశ్వనాథం, పూర్వ విశ్రాంత ఉద్యోగులు ఉన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

ఖిల్లాఘణపురం, నవంబర్ 21 : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు మంగళవారం బీఆర్ఎస్ నాయకుడు ఆదికేశవ్‌రెడ్డి ఆధ్వర్యం లో మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముందుగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆదికేశవ్‌రెడ్డి మాట్లాడుతూ ఖిల్లాఘణపురం మండలంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అయ్యిందని, మంత్రి నిరంజన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల్లో జరుగని అభివృద్ధి గడిచిన పదేండ్లలో ఎంతో అభివృద్ధి జరిగిందని, మంత్రి నిరంజన్‌రెడ్డి గెలుపులో భాగస్వాములమయ్యేందుకు బీఆర్ఎస్‌లో చేరినట్లు చెప్పారు.

### కాంగ్రెస్ హామీలు ఆచరణలో అసాధ్యం

వనపర్తి,నవంబర్ 21: రాష్ట్రంలో కాంగ్రెస్ చెబుతున్న మాటలు వినడానికి సోంపు గా ఉంటాయని కానీ.. ఆచరణలో సాధ్యం కానివని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. జిల్లాకేంద్రంలోని మంత్రి నివాసంలో పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామం నుంచి 35మంది బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు, పట్టణంలో 20వ వార్డు కౌన్సిలర్ పాకనాటి కృష్ణ ఆధ్వర్యంలో 10మంది యువకులు, బుద్ధారం మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ శేఖర్ గౌడ్, ఎంపీటీసీ విష్ణు, సర్పంచ్ నీలకంత ఆధ్వర్యంలో టీడీపీ నుంచి 20మంది, అలాగే జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో టీడీపీ నాయకుడు గంధం బాలపీరుతోపాటు 100మంది నాయకులు వేర్వేరుగా మంగళవారం మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ముందుగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 10 ఏండ్లలో తెలంగాణను ఎవరెస్టు స్థాయికి తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేన్నారు. అట్టడుగున్న వనపర్తి జిల్లాను కొంత సమయంలోనే సస్యశ్యామలం చేసుకున్నామన్నారు. వీటన్నింటిని ప్రజలకు వివరించే బాధ్యత మీ అందరిపై ఉందన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగం తిరుపతిరెడ్డి, డాక్టర్ భూపేష్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, గొర్రెల కాపరుల సంఘం కన్వీనర్ కురుమూర్తియాదవ్, రాములు యాదవ్, రాజవర్ధన్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, చీర్ల విష్ణు, బీరయ్య, చెన్నరాములు, మీడియా కన్వీనర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి